క్లుప్తంగా

కనుల పండువగా హోమాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెద్దతిప్పసముద్రం: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన హోమాలు, అభిషేకాలు కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు వేణుగోపాల శర్మ, సత్యనారాయణ శర్మ, శేషాచలం దేవుని ప్రతిమలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బిల్లులు చెల్లించండి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న సర్పంచులు

బి.కొత్తకోట: గ్రామపంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన సర్పంచులు బి.నాగిరెడ్డి, రఘునాథరెడ్డి, మాకిరెడ్డి రవికుమార్‌రెడ్డి, ఉజ్జయిని సాంబశివ కోరారు. సోమవారం ఎంపీడీఓ శంకరయ్యను కలిసిన సర్పంచులు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు, కార్యక్రమాలకు నిధులు ఖర్చు చేశామని వీటిని మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ శంకరయ్య మాట్లాడుతూ చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అజ్మద్దీన్‌ఖాన్

బి.కొత్తకోట: నడిచి వెళ్తున్న వృద్ధుడిని బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన బి.కొత్తకోటలో సోమవారం జరిగింది. బీసీకాలనీకి చెందిన అజ్మద్దీన్‌ఖాన్ (68) ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి నడిచి వెళ్తుండగా బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాధితునికి చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలకు గురికావడంతో 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

బి.కొత్తకోట: పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని గుడిపల్లె గ్రామం మరవపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్‌ను తొలగించేందుకు స్థానిక టీడీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. సోమవారం పాఠశాలకు వెళ్లి విచారించామని చెప్పారు. ఆరునెలలుగా స్వీపర్లు వేతనాలు చెల్లించకపోగా తొలగించాలని వేధింపులకు గురి చేయడం మానుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మృతురాలి కుమారుడు నాగేశ్వర, టి.ఎల్. వెంకటేష్

రాయచోటి : పీలేరు పట్టణం ఎస్‌కేఆర్ హాస్పిటల్‌లో ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన సంఘటనపై రెండోసారి సమగ్ర విచారణ జరపాలని కోరుతూ మృతురాలి కుమారుడు నాగేశ్వర, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.ఎల్. వెంకటేష్ సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 30న ఎస్‌కేఆర్ హాస్పిటల్‌లో వైద్యుల నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవి మృతి చెందిందని తెలిపారు. ఈ సంఘటనపై విచారణ అధికారులు ఆస్పత్రి యాజమాన్యంతో, పీలేరు ప్రభుత్వాస్పత్రి వైద్యులతో కలసి ఏకపక్షంగా విచారణ జరిపారని చెప్పారు. బాధితులతో కలసి వివరాలు సేకరించలేదని వాపోయారు. బాధితుల ఫిర్యాదుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి రెండో సారి విచారణకు ఆర్డీవో, డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించినట్లు తెలిపారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

పీలేరు : ఆలయాలకు, మసీదులకు, ప్రార్థనా మందిరాలకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా కోరారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆలయాలు, మసీదులు, చర్చీలకు ఉన్న విద్యుత్ మీటర్ కనెక్షన్లు క్యాటగిరి 1 నుంచి క్యాటగిరి 4సీకి మార్చాలని కోరారు.

ఆరోగ్యఫలం.. సీతాఫలం..!

సీతాఫలం ప్రకృతి ప్రసాదించిన వరం. రుచిలో అమృతం. శీతాకాలం ప్రారంభంలో మాత్రమే దొరికే ఈ ఫలం పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు ఇష్టపడని వారుండరు. ప్రస్తుతం మార్కెట్‌లో పుష్కలంగా లభించడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. సీతాఫలంలో సూక్ష్మపోషకాలు అధికం. వాపును తగ్గించే గుణాలు మెండు. గుండె, క్యాన్సర్ వంటి మొండి వ్యాధుల కారకాలను అడ్డుకుంటాయి. చర్మ సౌందర్యం, మెదడు పని విధానం మెరుగుపడుతుంది.



మదనపల్లె హెడ్‌పోస్టాఫీసు వద్ద విక్రయిస్తున్న సీతాఫలాలు

- సీతాఫలంలో పోషకాలు మెండు
- గ్రామీణులకు ఉపాధి
- చెన్నై, బెంగళూరుకు ఎగుమతి

మదనపల్లె సిటీ: పొలం గట్లు, అడవుల్లో సహజ సిద్ధంగా లభించే సీతాఫలాలు గ్రామీణ ప్రజలకు వరంగా మారాయి. పేదల ఆపిల్‌గా పేరొందిన ఈ ఫలం రుచితో పాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అందుకే చిన్నా,పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఇష్టపడుతారు. ఏటా అక్టోబర్ నెలలో మొదలుకుని డిసెంబర్ వరకు సీతాఫలాలు విరివిగా లభిస్తాయి. ధర కూడా అందరికీ అందుబాటులో ఉండడంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. బుట్ట రూ.250–300 వరకు విక్రయిస్తున్నారు.

మదనపల్లెలో ప్రత్యేక మండీలు

మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మకాలనీలో సీతాఫలాల అమ్మకాల మండీలు వెలిశాయి. ఇక్కడికి మదనపల్లె మండలం పనసమాకులకుంట, గొల్లపల్లి, వేంపల్లె, కట్టుబావి, మేడిపల్లి, కోళ్లబైలు, నిమ్మనపల్లె మండలంలోని రెడ్డివారిపల్లె, ముష్ఠూరు, తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లె నుంచి కాయలను ఇక్కడ మండీలు తీసుకువస్తారు. సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉండటంతో ఈ ప్రాంత వ్యాపారులు కాయలను చెన్నై, బెంగళూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో పండే సీతాఫలాలకు రుచిగా ఉండటంతో మంచి డిమాండ్ ఉంది.

సీతాఫలంలో లభించే పోషకాలు

కేలరీలు	: 80 నుంచి 101 మిల్లీ గ్రా.
తేమ	: 68.3-81 గ్రాములు
కార్బోహైడ్రేడ్స్	: 25-26 గ్రాములు
కాల్షియం, ఐరన్, సోడియం	: 17-27 మిల్లీగ్రాములు
విటమిన్-సీ	50 శాతం

ఔషధ గుణాలెన్నో..

- మెదడు నరాల వ్యవస్థ చురుగ్గా పనిచేయడానికిని ఉపకరిస్తుంది.
- క్షయవ్యాధి నివారణకు సీతాఫలాన్ని సమర్థవంతమైన ఆహార వైద్యంగా ఉపయోగిస్తారు.
- వేసవికాలంలో ఇందులో ఉన్న గుజ్జును పాలల్లో కలిపి తాగితే శరీరంలోని వేడి, దాహాన్ని తగ్గిస్తుంది.
- తలలో చుండ్రు ఉన్న వారు ఎండిన సీతాఫలం గింజలను మెత్తగా పొడి చేసి రోజూ షాంపులా వాడితే చుండ్రు త్వరగా తగ్గిపోతుంది.
- సీతాఫలం ఆకులను ఎండబెట్టి, పొడి చేసి కొబ్బరినూనెలో కలిపి పండ్ల మీద రాస్తే త్వరగా తగ్గిపోతాయి.

ఉపాధి లభిస్తుంది



ఉదయం నుంచి పొలం గట్లల్లోని చెట్లు నుంచి కాయలు కోసి మదనపల్లెకు తీసుకువస్తాము. స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్ద బుట్టలో కాయలు పేర్చి అమ్ముతున్నాము. డిమాండ్‌ను బట్టి అమ్మకాలు జరుగుతున్నాయి. కాయలు బాగుంటే బుట్ట రూ.250–300 పలుకుతున్నాయి. మూడు నెలలు ఉపాధి లభిస్తుంది.

–బుజ్జమ్మ, వేంపల్లె

మంచి డిమాండ్ ఉంది



సీతాఫలాలకు మంచి డిమాండ్ ఉంది. ఆరోగ్యానికి మంచిది కావడంతో ఎంతో మంది కొనుగోలు చేస్తున్నారు. సహజసిద్ధంగా పండిన కాయలు కావడంతో కొనుగోలు చేస్తున్నారు. వర్షాలు తక్కువ కావడంతో కాయలు తక్కువగా వస్తున్నాయి.

–భూదేవి, వేంపల్లె

శివ..శివా.. ఏమిటీ దుర్గంధం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన కోనేరు అధికారుల నిర్లక్ష్యంతో దుర్గంధ భరితంగా మారింది. కొండకు వచ్చే భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి కోనేరులో స్నానం చేసి దైవదర్శనానికి వెళ్తారు. అయితే కోనేరుకు పైపులైన్ ద్వారా నీటిని నింపుతారు. వారానికి ఒకరోజు నీటిని మార్చాల్సి ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో అందులో చెత్త కుళ్లి పాచిపట్టి దుర్గంధం వెదజల్లుతోంది. స్నానాల కోసం కోనేరు వద్దకు వెళ్లిన భక్తులు శివ..శివా ఏమిటి దుర్గంధం అంటూ ముక్కులు పట్టుకుంటున్నారు. ఇప్పటికైనా దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి కోనేరు శుభ్రపరచాలని భక్తులు కోరుతున్నారు. కోనేరు దుర్గంధంపై ఈఓ మునిరాజును వివరణ కోరగా ఆలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రెండు రోజుల్లో కోనేరు శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు ఇబ్బంది కలుగకుండా చూస్తామని చెప్పారు.



కోనేరు నిండా పేరుకుపోయిన చెత్తా చెదారం

నైపుణ్య గణనపై శిక్షణ

రామసముద్రం: రామసముద్రం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నైపుణ్య గణన 2024 శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఏఓ. గౌస్‌బాషా ఆధ్వర్యంలో , మండల స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో 18 నుంచి 59 ఏళ్ల వయస్సు వారి వివరాలను సేకరించాలన్నారు. వారి విద్యా అర్హతలు, సామాజిక, ఆర్థిక, స్థితిగతులు, వారి ఉద్యోగ అనుభవం, ఉద్యోగ ఆసక్తి, ప్రస్తుత ఉపాధి తదితర వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంఈఓ–2 ఆంజనేయులు, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ నవీమ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రియాజ్ అలీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రంగా నిర్వహించాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్కిల్ సెన్‌సెస్ (నైపుణ్య గణన) సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నైపుణ్య గణన నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి

కలకడ : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ నంబర్‌ను నమోదు చేయాలని తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం, మండలవిద్యాశాఖ అధికారి రామచంద్రారెడ్డి తెలిపారు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థి కోడ్ నంబర్ జనరేట్ చేయడానికి ఆధార్ కార్డులలో ఇంటి పేరు, పుట్టిన తేదీ సరిచేయడానికి ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదని ప్రధానోపాధ్యాయులు సమావేశంలో ప్రస్తావించారు. మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేయాలని, ఎలాంటి సమస్యలున్నా ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేయాలని ఎంపీడీఓ సూచించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మదనపల్లె సిటీ: వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలనిఏ రాష్ట్ర బోయ సంఘం కో కన్వీనర్ గోవిందు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో జిల్లా వాల్మీకి, బోయ సంఘం నూతన కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా వాల్మీకుల తలరాతలు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీలుగా చేరుస్తామని మాయమాటలు చెప్పి మోసం చేశారని ఆరోపించారు. బోయ విద్యార్థులకు ఎస్టీలుగా చేర్చి, గురుకుల పాఠశాలలు కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

జిల్లా గౌరవ అధ్యక్షులుగా తలారి శ్రీనివాసులు, కొత్తూరు చిన్నరెడ్డప్ప, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొమ్మనపల్లె లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శిగా చెన్నం వెంకటరమణ, కార్యదర్శిగా పారేసు రాజగోపాల్, మేకల లక్ష్మినారాయణ, పారేశి రెడ్డిభాస్కర్, ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా కోట రమణ, జిల్లా అధికార ప్రతినిధిగా శేఖర, మదనపల్లె పట్టణ ప్రెసిడెంట్‌గా లక్ష్మిపతి, మండల ప్రెసిడెంట్‌గా నాగినేని మల్లికార్జున, రామసముద్ర మండల ఉపాధ్యక్షుడిగా సత్రం కదిరప్ప, మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షుడిగా ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులుతో పాటు కార్యవర్గసభ్యులను ఎన్నికయ్యారు.



జిల్లా వాల్మీకి, బోయ సంఘం నూతన కమిటీ

సారా విక్రేతల అరెస్ట్

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిప్పే స్వామి తెలిపారు. మండలంలోని బండ్లపై హరిజనవాడలో సారా విక్రయిస్తున్న చంగప్ప, రామలక్ష్మిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని ధర్నా

బి.కొత్తకోట: ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తక్షణమే హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగుల కోసం ఇచ్చిన హామీలతో టీడీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఐదు నెలలు గడుస్తున్నా అమలు చేయదగిన ఈ హామీలను అమలు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అష్రఫల్లీ, నరసింహులు, ఉత్తన్న, గంగులప్ప, నారాయణస్వామి, హబీబ్, రియాజ్, తంబయ్యశెట్టి, రఘునాథ్ పాల్గొన్నారు.



బి.కొత్తకోట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా సీపీఐ నాయకులు

వలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మదనపల్లె సిటీ: వలంటీర్లకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని గ్రామ, వార్డు వలంటీర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మహేష్ విమర్శించారు. వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రెండు నెలలుగా వలంటీర్లు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సందర్భంగా వలంటీర్లను యథావిధిగా కొనసాగిస్తామని, గౌరవ వేతనం రూ.5 వేలు నుంచి రూ.10 వేలు పెంచుతామని ఊరూరా తిరుగుతూ చెప్పిన మాటలు నేడు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నెల 9న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి వలంటీర్ల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌కుమార్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు హరి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్, తిరుమల, లలిత, మమత పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్ల సంఘం నాయకులు

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు



మదనపల్లె సిటీ: శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో కేదారగౌరీ నోముల వ్రతంలో భక్తులు



కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై కొలువైన మల్లేశ్వరుడు



పీలేరురూరల్ : వ్రతంలో పాల్గొన్న మహిళాభక్తులు

కలకడ : కార్తీక మాస మొదటి సోమవారం పురస్కరించుకుని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో కేదారేశ్వర వ్రతం నిర్వహించారు. మండలంలోని కలకడ సిద్దేశ్వరస్వామి, కోన, నడిమిచెర్ల, పారిరెడ్డిగారిపల్లె శివాలయాల్లో భక్తులు ఉపవాసదీక్షలతో నోముదారుల ధరించి, వ్రతం ఆచరించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మల్లయ్య కొండపై కార్తీక శోభ

కురబలకోట: అంగళ్లు మల్లయ్యకొండపై కార్తీక శోభ సంతరించుకుంది. శివ నామస్మరణతో పరమేశ్వరుడి కొండ మారుమోగింది. కార్తీక మాసం తొలి సోమవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.శివుడికి అర్చకులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..

పీలేరురూరల్ : స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకుని మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పలువురు మహిళా భక్తులు ఆలయంలో కేదారేశ్వర స్వామి వ్రతం చేపట్టి నోములు నోచుకున్నారు.ఆలయ ప్రధాన అర్చకులు కుమార్‌స్వామి నోముల వ్రతం గూర్చి కథను చదివి వినిపించారు.

కేదారగౌరీ నోముల వ్రతం

మదనపల్లె సిటీ: కార్తీకమాసం పురస్కరించుకుని మొదటి సోమవారం కేదారగౌరీ నోముల వ్రతంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయంలోని మండపంలో కేదార నోముల వ్రతాన్ని అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ నిర్వహించారు. కేదారగౌరీ నోములవ్రత కథను భక్తులకు వినిపించారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో కేదార నోముల వ్రతాన్ని అర్చకులు ఫణికుమార్‌శర్మ నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో శివలింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయాల్లో కేదారనోముల వ్రతం నిర్వహించారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు వచ్చారు. ఉత్తరాయణం కార్తీకమాసంలో సూర్యుడు ఉదయించగానే సూర్య కిరణాలు ఆలయంలోని శివలింగాన్ని తాకడం ఈ సన్నివేశాన్ని తిలకించిన భక్తులు పరవశించిపోయారు. మహిళలు ఆలయ ధ్వజస్తంభం ఎదుట కార్తీక దీపాలను వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.



కలకడ: సిద్దేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



తంబళ్లపల్లె: ప్రత్యేక అలంకరణలో స్వామి

ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం బండకిందపల్లె ఎర్రబల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ (48) మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్థాపంతో గన్నేరు కాయలు తిని ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట ప్రాంతానికి అహ్మద్‌బాషా భార్య రజ్న (27) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే విధంగా గుర్రంకొండ మండలం సరిమడుగు గ్రామానికి చెందిన సాయిప్రతాప్ భార్య సుకన్య (22) కుటుంబ సమస్యలతో ఆదివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో కుటుంబసభ్యులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

మదనపల్లె: తమ ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దని, మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అంకిశెట్టిపల్లె పంచాయతీ, పప్పిరెడ్డిగారిపల్లె, సురభి కాలనీవాసులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. మందుబాబులు ఉదయం నుంచి పొద్దుపోయే వరకు ఈ ప్రాంతంలోనే ఉంటున్నారని, రాకపోకలు సాగిస్తున్న ప్రజలు, మహిళలకు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం తాగి తమ నివాస ప్రాంతాల సమీపంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారని, తాగిన బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు అక్కడే పడేస్తున్నారని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని వారు వాపోయారు. అలాగే మదనపల్లి మండలం వలసపల్లెకు చెందిన రామకృష్ణ భార్య సరస్వతమ్మ, తనకు నిమ్మనపల్లె మండలం రాచవేటి వారి పల్లె పంచాయతీలో భర్త పేరుపై ఉన్న భూమి వారసత్వంగా సంక్రమించిందని, ఆ భూమికి రెవెన్యూ అధికారులు పాస్ బుక్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పలువురు వినతిపత్రాలు అందజేశారు.

పట్టణ అభివృద్ధికి సహకరించండి

మదనపల్లె: పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్ల వెడల్పు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు భవన యజమానులు, వ్యాపారులు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా కోరారు. సోమవారం సీటీఎం రోడ్డులోని విజయలక్ష్మి కల్యాణ మండపంలో భవన యజమానులు వ్యాపారులతో డి.ఎస్.పి కొండయ్య నాయుడుతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ సీటీఎం రోడ్డులో చెట్ల తొలగింపు అభివృద్ధిలో భాగమేనన్నారు. వ్యాపారులు భవన యజమానులు తప్పనిసరిగా తమ సముదాయాలు ఎదుట ఐదు అడుగుల పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని సూచించారు. వ్యాపారులు, భవన యజమానులు మాట్లాడుతూ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, సీటీఎం రోడ్డు వెడల్పు చేసి, ఫుట్ పాత్ పార్కింగ్ స్థలాలను కేటాయించి వ్యాపార అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, దేవత సతీష్, బాలు స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హరిప్రసాద్

మదనపల్లె సిటీ: యూటీఎఫ్ జిల్లా కమిటీని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతిరాజా ప్రకటించారు. సోమవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో కమిటీ సభ్యుల పేర్లు ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా టి.సుధాకర్‌నాయుడు, అధ్యక్షుడిగా బి.హరిప్రసాద్, అసోసియేటివ్ అధ్యక్షుడిగా ఎస్.శివారెడ్డి, మహిళా అసోసియేటివ్ అధ్యక్షురాలిగా కె.హేమలత, ప్రధాన కార్యదర్శిగా షేక్ సాబీర్, కోశాధికారిగా బి.చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శులు పి.వెంకటరమణ, కె.ఆదినారాయణ, టి.భాస్కర్‌రెడ్డి, వై.శ్రీధర్‌రెడ్డి, దావూద్, అక్రమ్‌బాషా, పి.వెంకటసుబ్బయ్య, సి.వి.రమణమూర్తి, కె.శ్రీలత, ఫణీంద్ర ప్రసాద్‌యాదవ్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వి.సురేంద్రరెడ్డి, సభ్యులుగా రమణయ్య, మస్తానయ్య, ప్రసాద్, అజమతుల్లా, శివశంకర్, నీలేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా హరిప్రసాద్, హేమలత, చెంగల్‌రాజు, టి.శివారెడ్డి, జిల్లా సీపీఎస్ సబ్ కమిటీ కన్వీనర్‌గా అంజాద్, స్పోర్ట్స్ సబ్ కమిటీ కన్వీనర్‌గా ఆర్.సుధాకర్, ప్రచురణ కమిటీ కన్వీనర్‌గా కె.విజయకుమార్‌ను ఎన్నుకున్నారు.